క్లుప్తంగా

ఆటో ఓనర్స్ అండ్ వర్కర్స్ అసోసియేషన్ ఆవిర్భావం



మినీ గూడ్స్ ఆటో ఓనర్స్ అండ్ వర్కర్స్ అసోసియేషన్‌తో ఎంపీ భరత్‌రామ్

రాజమహేంద్రవరం రూరల్: మోరంపూడి జంక్షన్ నామవరం వెళ్లే రోడ్డులో మినీగూడ్స్ ఆటో ఓనర్స్ అండ్ వర్కర్స్ అసోసియేషన్ ఆవిర్భవించింది. ఇది వైఎస్సార్ టీయూసీ అనుబంధంగా ఏర్పాటైంది. శనివారం అసోసియేషన్ ప్రారంభోత్సవానికి గౌరవ అధ్యక్షుడు, ఎంపీ మార్గాని భరత్‌రామ్ ముఖ్య అతిథిగా హాజరై అసోసియేషన్ నామఫలకాన్ని ఆవిష్కరించారు. విశిష్ట అతిథులుగా పార్టీ నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి, నగర మినీ గూడ్స్, ఆటో ఓనర్స్ అండ్ వర్కర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్వీ శ్రీనివాసరావు, వైఎస్సార్ టీయూసీ నాయకులు పాలిక శ్రీను, దాది శంకర్, నాయకుడు దాసరి ప్రసాద్ హాజరయ్యారు. కొత్త పాలకవర్గాన్ని ఆ యూనియన్ అధ్యక్షుడు ఎన్వీ శ్రీనివాసరావు ఎంపీకి పరిచయం చేశారు. అసోసియేషన్ అధ్యక్షుడు కిల్లి సింహాద్రి, ఉపాధ్యక్షుడు కడియాల మణికంఠ, కార్యదర్శి దేవాని వీరబాబు, సహాయ కార్యదర్శి లోశెట్టి పోతురాజు, కోశాధికారి గొర్లె లోకేష్, సభ్యులు, అనేకమంది కార్మిక నాయకులు పాల్గొన్నారు. అనంతరం ఎన్వీ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఎంపీ చలివేంద్రాన్ని ప్రారంభించారు.

కాంగ్రెస్‌పై విమర్శలు చేయడం సరికాదు

రాజమహేంద్రవరం సిటీ: కాంగ్రెస్ పార్టీ ద్వారా నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి ముఖ్యమంత్రి, స్పీకర్, విప్ పదవులను అనుభవించి ఇప్పుడు ఆ పార్టీపై విమర్శలు చేయడం దారుణమని నగర కాంగ్రెస్ అధ్యక్షుడు బాలేపల్లి మురళీధర్, పీసీసీ కార్యదర్శి ముళ్లమాధవ్, మహిళా రాష్ట్ర నాయకురాలు ఆకుల సూర్యభాగ్యలక్ష్మి ధ్వజమెత్తారు. శనివారం స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో విలేకరులతో వారు మాట్లాడారు. మాజీ సీఎం కిరణ్‌కుమార్‌రెడ్డి బీజేపీలో చేరడం ఆయన అంతర్గతమన్నారు. అయితే కాంగ్రెస్ పార్టీలో అన్ని పదవులు అనుభవించి ఇప్పుడు విమర్శించడం సరికాదన్నారు.

బ్యాంకు అక్కౌంట్‌లో నగదు మాయం

కడియం: తన యూనియన్ బ్యాంకు అక్కౌంట్ నుంచి దఫదఫాలుగా రూ. 22 వేలు మాయమైందని కడియం గ్రామానికి చెందిన లక్కింశెట్టి జగన్నాథరావు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు శనివారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు కడియం పోలీసులు తెలిపారు.

మెగా రక్తదాన శిబిరం



రక్తదాతలను అభినందిస్తున్న ఏడిద బాబీ

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): సినీ నటుడు అల్లు అర్జున్ జన్మదిన వేడుకల సందర్భంగా శనివారం అల్లు అర్జున్ ఆర్మీ దొడ్డ మణికంఠ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. స్థానిక వైఎస్సార్– జక్కంపూడి రామ్మోహనరావు బ్లడ్ బ్యాంక్‌లో మెగా రక్తదాన శిబిరం జరిపారు. తొలుత శిబిరాన్ని రాష్ట్ర చిరంజీవి యువత ప్రధాన కార్యదర్శి ఏడిద బాబీ ప్రారంభించి, రక్తదాతలను అభినందించారు. కార్యక్రమంలో దొడ్డి జాని, కృష్ణంరాజు, రాజేష్ కన్నా, నారాయణ, గౌతమ్, అధిక సంఖ్యలో అభిమానులు పాల్గొన్నారు.

నవధాన్యాల సాగుతో నేల సారవంతం



రైతులకు నవధాన్యాల కిట్‌లను అందజేస్తున్న ప్రకృతి వ్యవసాయ సిబ్బంది

కడియం: వివిధ పంటల సాగుకు ముందు నవధాన్యాలను సాగు చేయడం ద్వారా నేల సారవంతంగా మారుతుందని ప్రకృతి వ్యవసాయ సిబ్బంది వల్లీ వివరించారు. స్థానిక ఆర్బీకే వద్ద 13 కిలోల చొప్పున నవధాన్యాల కిట్‌లను రైతులకు అందుబాటులో ఉంచారు. దీనిపై శనివారం ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో మాస్టర్ ట్రైనర్ లక్ష్మణ్ మాట్లాడారు. నవధాన్యాలను వేసుకోవడం ద్వారా నేలకు, తద్వారా పంటకు కలిగే ప్రయోజనాలను వివరించారు. కడియం ఆర్బీకే వద్ద వీటిని అందుబాటులో ఉంచామని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వ్యవసాయ సిబ్బంది గౌతమ్ తదితరులు పాల్గొన్నారు.

జనసేన ప్రచారం

రాజమహేంద్రవరం రూరల్: రాయుడుపాకలు గ్రామం నుంచి జనచైతన్య శంఖారావాన్ని ఉమ్మడి జిల్లా జనసేన అధ్యక్షుడు కందుల దుర్గేష్ శనివారం ప్రారంభించారు. ఇంటింటికీ వెళ్లి పార్టీ సిద్ధాంతాలను ప్రజలకు వివరించారు.మాజీ ఎంపీపీ రామారావు పాల్గొన్నారు.

చక్కని ప్రణాళిక.. సమస్య లేదిక

- నీటి ఇబ్బంది రాకుండా కార్యాచరణ
- ముందస్తు చర్యలతో సత్ఫలితాలు

సీటీఆర్ఐ: చక్కని ప్రణాళిక ఉంటే చేపట్టే పని విజయవంతం అవుతోంది.. అందరికీ మేలు జరుగుతోంది.. వేసవిలో తాగునీటి ఇబ్బంది రాకుండా అలాంటి ప్రణాళికతోనే రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ ముందుకు సాగుతోంది. దీనికోసం అవసరమైన కార్యాచరణ చేపట్టింది. కలెక్టర్ మాధవీలత ఆదేశాలతో తాగునీటి విషయంలో జాగ్రత్తలు తీసుకుంటోంది. రాజమహేంద్రవరం అర్బన్ పరిధిలో సుమారు ఐదు లక్షల జనాభా ఉన్నారు. మొత్తం 46,178 మంచినీటి కుళాయి కనెక్షన్లు ఉన్నాయి. వ్యక్తిగత కుళాయిల ద్వారా రోజుకు 75 ఎంఎల్‌డీ నీటిని సరఫరా చేస్తున్నారు. మొత్తం 22 రిజర్వాయర్ల ద్వారా ఈ నీటిని నగరానికి అందిస్తున్నారు. ఇదిలా ఉంటే నగరంలో శివారు ప్రాంతాలుగా 45, 46, 47, 48, 49, 50 డివిజన్లు ఉన్నాయి. శివారు ప్రాంతాలైన క్వారీ మార్కెట్, సుబ్బారావు నగర్, సిద్ధార్థనగర్, రామదాసు పేట, ఆనందనగర్, బర్మాకాలనీ, సింహాచల నగర్, చెంచుకాలనీ, సువిశేష పురం, మున్సిపల్ కాలనీ, సుభాష్‌నగర్, లూథరిగిరి తదితర ప్రాంతాలకు తక్కువగా నీరు అందుతోంది. ఈ ఇబ్బందిని ముందుగానే గుర్తించిన అధికారులు ఆరు వాటర్ ట్యాంకర్ల ద్వారా తాగునీటిని ఆయా ప్రాంతాలకు సరఫరా చేస్తున్నారు. వేసవి ముగిసే వరకూ నీటిని అందించనున్నారు. ఉదయం కొన్ని ప్రాంతాలకు, సాయంత్రం మరికొన్ని ప్రాంతాలకు ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నారు.

ఎప్పటికప్పుడు మరమ్మతులు

నగరపాలక సంస్థ పరిధిలో తాగునీటి పైపులైన్ల, ట్యాంకుల రిపేర్లపై అధికారులు ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. ఆయా ప్రాంతాలకు ఇబ్బంది రాకుండా తమ దృష్టికి వచ్చిన వెంటనే పనులు చేపట్టి చుక్కనీరు కూడా వృథా కాకుండా చూస్తున్నారు. మంచినీటి ట్యాంకుల పరిస్థితి, లీకేజీలను పరిశీలించి వెంటనే క్లీనింగ్ చేయిస్తున్నారు. మార్చి నెలఖారు నుంచే వేసవి ఉష్ణోగ్రతలు 32 డిగ్రీల నుంచి 37 డిగ్రీలకు చేరుకుంటున్నాయి. ఈ నేపథ్యంలో తాగునీటి అవసరాలు పెరుగుతున్నాయి. అందుకు అనుగుణంగా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

రెండు పూటలా నీరు



మా ప్రాంతంలో రోజుకు రెండు పూటలా నీరు సరఫరా అవుతుంది. ఉదయం 8 గంటలకు ఒకసారి, రాత్రి 8 గంటలకు ఒకసారి నీటిని సరఫరా చేస్తున్నారు. దీంతో తాగునీటికి సమస్య ఉండడం లేదు. ఎండలు ఎక్కువగా ఉండటంతో నీటి వాడకం పెరిగింది. అందుకనే పొదుపుగా వాడుకుంటున్నాం.

–మోర్త సీత, 48వ డివిజన్

ట్యాంకర్లతో సరఫరా..



తాగునీటి కుళాయిల ద్వారా నీరు రాకపోతే ట్యాంకర్ల ద్వారా సరఫరా చేస్తున్నారు. ఇప్పటికి మాకు కుళాయిల నుంచి వస్తుంది. ఏప్రిల్‌లో ఇంకా ఎండలు ముదిరితే నీరు ఒకపూట మాత్రమే సరఫరా అవుతుంది. అప్పుడు నీటికి ఇబ్బంది లేకుండా ట్యాంకర్ల ద్వారా సరఫరా చేస్తుండడంతో ఇబ్బంది లేకుండా ఉంటుంది.

– ఏనుగుపల్లి లక్ష్మి, సంజీవనగర్



సీతంపేటలో వాటర్ ట్యాంక్

వైభవంగా లక్ష కుంకుమార్చన



మహాకాళేశ్వరాలయం యాగశాలలో పూజలు చేస్తున్న దృశ్యం

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): స్థానిక ఇన్నీసుపేటలోని మహాకాళేశ్వరాలయం (మరో ఉజ్జయిని) ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా శనివారం మహాకాళీ అమ్మవారికి లక్ష కుంకుమార్చనను వైభవంగా నిర్వహించారు. ఉదయం గణపతి పూజ, పుణ్యాహవచనం, గోపూజ, రక్షాబంధనం, సాయంత్రం యాగశాలలో నవగ్రహ మండపం, వాస్తు మండపం, అగ్నిప్రతిష్ఠాపన తదితర పూజలు చేశారు. మధ్యాహ్నం అన్న సమారాధన జరిగింది. అధిక సంఖ్యలో భక్తులు హాజరై స్వామివారిని దర్శించుకుని ప్రసాదాలు స్వీకరించారని వ్యవస్థాపక అధ్యక్షుడు పట్టపగలు వెంకటరావు తెలిపారు. ఆదివారం గణపతిపూజ, గోపూజ, 108 మంది దంపతులచే సామూహిక గణపతి హోమం, రుద్ర హోమం, నవగ్రహ హోమం ఉంటాయని ఆలయ అర్చకుడు ఆదిత్య తెలిపారు.

డ్రీమ్స్‌లో గ్రాడ్యుయేషన్ వేడుక



కిండర్ గార్టెన్ డిప్లొమో పట్టాలతో డ్రీమ్స్ స్కూల్ విద్యార్థులు

ధవళేశ్వరం: ధవళేశ్వరం డ్రీమ్స్ స్కూల్‌లో గ్రాడ్యుయేషన్ వేడుకను శనివారం ఘనంగా నిర్వహించారు. దీనికి సీఐ కె.మంగాదేవి ముఖ్య అతిథిగా విచ్చేశారు. ప్రీ ప్రైమరీ పూర్తి చేసిన విద్యార్థులకు కిండర్ గార్టెన్ డిప్లొమో పట్టాలను సీఐ ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులను ప్రోత్సహించే విధంగా గ్రాడ్యుయేషన్ వేడుకలను నిర్వహించిన డ్రీమ్స్ యాజమాన్యాన్ని అభినందించారు. గ్రామీణ వాతావరణంలో కార్పొరేట్‌కు ధీటుగా సాధారణ ఫీజులకే విద్యను అందించడం హర్షణీయమన్నారు. విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. కరస్పాండెంట్ ఎ.రమేష్, ప్రీ ప్రైమరీ స్కూల్ ప్రిన్సిపాల్ జి.విమలారోజీ, వేమగిరి ప్రీప్రైమరీ స్కూల్ ప్రిన్సిపాల్ కె.లలితాదేవి, ప్రైమరీ స్కూల్ ప్రిన్సిపాల్ ఎ.భ్రమరాంబ, హైస్కూల్ ప్రిన్సిపాల్ వి.సంధ్యా కుమారి, అకడమిక్ కోఆర్డినేటర్ ఎస్.దీపిక పాల్గొన్నారు.



పట్టా ప్రదానం చేస్తున్న సీఐ మంగాదేవి

వైఎస్సార్ సీపీ అంటేనే ప్రజలకు విశ్వాసం

- 'జగనన్నే మా భవిష్యత్తు'ను విజయవంతం చేద్దాం
- ఎంపీ మార్గాని భరత్‌రామ్ పిలుపు



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ మార్గాని భరత్‌రామ్, చిత్రంలో రాజ్యసభ సభ్యుడు సుభాష్‌చంద్రబోస్

రాజమహేంద్రవరం రూరల్: వైఎస్సార్ సీపీ ప్రభుత్వంపై ప్రజలకు అపార విశ్వాసం, అభిమానం ఉందని ఆ పార్టీ పార్లమెంటరీ చీఫ్ విప్, ఎంపీ మార్గాని భరత్‌రామ్ తెలిపారు. శనివారం స్థానిక వీఎల్ పురం మార్గాని ఎస్టేట్స్ ప్రాంగణంలోని ఎంపీ కార్యాలయంలో వార్డు ఇన్‌చార్జులు, కన్వీనర్లు, గృహసారథులు, క్లస్టర్ ఇన్‌చార్జులు, పార్టీ నేతలతో విస్తృత స్థాయి సమావేశాన్ని పార్టీ నగరాధ్యక్షుడు అడపా శ్రీహరి అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎంపీ భరత్‌రామ్ మాట్లాడుతూ పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. 'జగనన్నే మా భవిష్యత్తు' కార్యక్రమం నిర్వహణలో ఏ మాత్రం అశ్రద్ధ వద్దని పార్టీ శ్రేణులకు తెలిపారు. జగనన్న అప్పగించిన ఈ బాధ్యతను విజయవంతంగా నిర్వహిద్దామని పిలుపునిచ్చారు. జగన్‌మోహన్‌రెడ్డిని తిరిగి ముఖ్యమంత్రి చేసేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని, గడప గడపకూ వెళ్లినప్పుడు అది స్పష్టమైందని, దానిని నిలబెట్టాల్సిన అవసరం పార్టీ శ్రేణులపైనే ఉందన్నారు. వైఎస్సార్ సీపీ కార్యకర్త అంటే ప్రజల్లో గౌరవం ఉందని, అదే గౌరవంతో ప్రజలకు సేవ చేయాలని అన్నారు. సమస్యలు తెలుసుకుని పరిష్కరించడంలోనే నాయకత్వ లక్షణాలను ప్రజలు గుర్తిస్తారన్నారు. ప్రధానంగా వార్డు ఇన్‌చార్జులు.. మీరే కాబోయే కార్పొరేటర్లని అన్నారు. జిల్లాలో అన్ని స్థానాలను వైఎస్సార్ సీపీ గెలవాలన్న లక్ష్యంతో ముందుకు సాగాలన్నారు. ప్రతిపక్షాలు మనల్ని వేలెత్తి చూపే విధంగా ఏ ఒక్కరూ వ్యవహరించవద్దని ఎంపీ హితవు పలికారు. ఉభయగోదావరి జిల్లాల రీజినల్ కోఆర్డినేటర్ పిల్లి సుభాస్‌చంద్రబోస్, రూరల్ కోఆర్డినేటర్ చందన నాగేశ్వర్, మజ్జి అప్పారావు, పాలిక శ్రీను, సంకిస భవానీ ప్రియ, పోలు విజయలక్ష్మి, బర్రే కొండబాబు, కొత్త విజయ రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి



మృతి చెందిన జహ్రుద్దీన్

రాజమహేంద్రవరం రూరల్: విద్యుత్ షాక్‌తో లారీ డ్రైవర్ మృతి చెందిన ఘటన శనివారం రాత్రి మోరంపూడి జాస్తి బుల్లెమ్మాయి కళాశాల సమీపంలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. హరియానా రాష్ట్రం పున్నహాన ప్రాంతానికి చెందిన జహ్రుద్దీన్ (51) లారీపై పైపుల లోడ్‌తో శనివారం రాత్రి 7 గంటల సమయంలో వచ్చి మోరంపూడిలో అన్‌లోడ్ చేశాడు. తిరిగి వెళ్లేందుకు లారీని వెనుకకు తీస్తుండగా వైర్లు అడ్డుగా ఉన్నాయని కేబుల్ వైర్ల అనుకుని తప్పించబోయాడు. ఈ లోగా పైన హైపవర్ విద్యుత్ లైన్ ఉండడంతో షాక్ తగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. ఘటనా స్థలాన్ని బొమ్మూరు ఎస్సై శివాజీ పరిశీలించి మృతదేహాన్ని రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రి మార్చురీకి తరలించారు. జహ్రుద్దీన్ సోదరుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై శివాజీ తెలిపారు.

ఆన్‌లైన్ మోసంపై ఫిర్యాదు

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): ఆన్‌లైన్ మోసంపై ఓ వ్యక్తి ఫిర్యాదు మేరకు త్రీటౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. గత నెల 12న స్థానిక జెండా పంజా రోడ్డుకు చెందిన ప్రైవేట్ సంస్థ ఉద్యోగి కె.సతీష్‌కు ఎస్‌బీఐ యోనో యాప్ అప్‌డేట్ చేసుకోవాలని, లేకపోతే బ్యాంకు ఖాతా బ్లాక్ అవుతుందని ఓ లింక్ మేసేజ్ వచ్చింది. లింక్‌ను క్లిక్ చేసిన సతీష్ తన బ్యాంకు ఖాతా వివరాలతో పాటు ఓటీపీ నమోదు చేశాడు. అనంతరం గంటల వ్యవధిలో తన ఖాతాలోని రూ.40 వేలు విత్‌డ్రా చేసుకున్నట్లు సందేశాలు వచ్చాయి. ఈ విషయం గమనించి బ్యాంకులో సంప్రదించగా మోసపోయానని గ్రహించి ఆన్‌లైన్ ద్వారా సైబర్ క్రైమ్‌కు ఫిర్యాదు చేశాడు. సదరు విభాగం నుంచి శనివారం త్రీటౌన్ పోలీస్ స్టేషన్‌కు ఫిర్యాదు రావడంతో ఇన్‌స్పెక్టర్ మధుబాబు కేసు నమోదు చేశారు.

ట్రాఫిక్‌తో రాజానగరం

- రోడ్డెక్కుతున్న వ్యాపారాలతో ఇబ్బంది
- పట్టించుకోని పోలీసు యంత్రాంగం



రాజానగరం గాంధీ బొమ్మ సెంటర్‌లో వాహనాలు తప్పించుకునే మార్గం లేక ఇలా..

రాజానగరం: అటో.. ఇటో.. ఎటో.. రహదారిపైకి వస్తే వచ్చే ఇబ్బంది ఇది. అసలే ఇరుకు మార్గం.. ఆపై రోడ్డెక్కుతున్న వ్యాపారాలతో వెళ్లే దారి బక్కచిక్కుతోంది.. ట్రాఫిక్ సమస్య నానాటికీ జటిలంగా మారుతోంది.. నియోజకవర్గ కేంద్రం రాజానగరంలో పరిస్థితి ఇది. వ్యాపార, విద్యారంగం పరంగా ప్రత్యేకతను చాటుకుంటున్న ఈ గ్రామంలో సరైన రహదారుల వ్యవస్థ లేక ఇబ్బందిగా మారింది. ఇటుగా వెళ్లే ప్రయాణికులకు ట్రాఫిక్ సమస్య పెద్ద సవాలు విసురుతోంది. అయినా పోలీసు యంత్రాంగం పట్టించుకుంటున్న దాఖలాలు కనిపించడం లేదని ప్రజలు అంటున్నారు. రాజానగరంలో ప్రధాన రోడ్డుకు ఇరువైపులా మేజర్ సీసీ డ్రైన్లు ఉన్నాయి. గతంలో ఇక్కడ ఎస్సైగా పనిచేసిన ఎస్.భాస్కరరావు వ్యాపారాలు జోరుగా జరిగే స్థానిక బస్టాండ్ నుంచి గాంధీబొమ్మ సెంటర్, అన్నదాన సత్రం, కోదండ రామాలయం వరకూ ఆ సీసీ డ్రైన్లను లక్ష్మణరేఖ నిర్ణయించి, వాటిని దాటి వ్యాపారులు రోడ్డుపైకి రాకూడదంటూ హుకుం జారీ చేశారు. పంచాయతీ అధికారుల ద్వారా ట్రాఫిక్ సమస్య రాకుండా చర్యలు తీసుకున్నారు. ఆ తరువాత అనేక సందర్భాల్లో వ్యాపారులు ముందుకు వచ్చినా గాని, పంచాయతీ సిబ్బంది అవసరమైన చర్యలు తీసుకుంటూ వచ్చేవారు. కొన్నేళ్లుగా ఆ లక్ష్మణరేఖను దాటి వ్యాపారులు రోడ్డుపైకి వచ్చి కార్యకలాపాలు సాగిస్తున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. దీనివల్ల ట్రాఫిక్ సమస్య అంతకంతకూ జటిలమవుతోంది.

ఎక్కడెక్కడ అంటే..

ముఖ్యంగా గాంధీబొమ్మ సెంటర్ నుంచి అటు అన్నదాన సత్రం, ఇటు బస్టాండ్ సెంటర్ వరకూ దుకాణాల ముందు వాహనాలు నిలిపే జాగా ఉండడం లేదు. ఆయా దుకాణాలకు వచ్చే వినియోగదారులు తమ వాహనాలను రోడ్డుపైనే పార్కింగ్ చేస్తున్నారు. కొంతమంది వ్యాపారులు తమ వ్యాపారాలను షెడ్లు వేసి మరీ రోడ్డుపైకి విస్తరించడంతో వెళ్లే దారి కుచించుకుపోయింది. ఇదే ప్రధానంగా ట్రాఫిక్ సమస్యకు కారణమవుతోంది. ఈ సమస్య గాంధీబొమ్మ సెంటర్‌లో తీవ్రంగా ఉంది. ఎదురుగా వచ్చిన ఒక బస్సును మరో బస్సు తప్పించేందుకు కూడా అవసరమైన జాగా లేదంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. ఇది నిత్యం ఎదురయ్యే సమస్యే అయినా అక్కడ ట్రాఫిక్ నియంత్రణకు ఒక్క పోలీసు కూడా కనిపించరు. సుమారు 50 మంది సిబ్బంది ఉన్న రాజానగరం పోలీస్ స్టేషన్ నుంచి గతంలో బస్టాండు సెంటర్, గాంధీ బొమ్మ సెంటర్, వైఎస్సార్ జంక్షన్, హైస్కూల్ జంక్షన్‌లలో పోలీసులు ట్రాఫిక్ సమస్య రాకుండా విధులు నిర్వహించేవారు. ప్రస్తుతం ఏ సెంటర్‌లోనూ పోలీసులు కనిపించడం లేదు. అప్పుడప్పుడు వాహనదారులకు ఫైన్లు వేయడానికి తప్ప, ట్రాఫిక్ సమస్య నివారణకు చర్యలు తీసుకోవడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. దీనిపై సంబంధిత ఉన్నతాధికారులు దృష్టి పెట్టాలని ప్రజలు కోరుతున్నారు.



రోడ్డుపైకి వచ్చిన వాహనాల పార్కింగ్

సమస్యను పరిష్కరిస్తాం..



రాజానగరాన్ని వేధిస్తున్న ట్రాఫిక్ సమస్యను పరిష్కరించడానికి త్వరలోనే అవసరమైన చర్యలు తీసుకుంటాం. ప్రస్తుతం 10వ తరగతి పబ్లిక్ పరీక్షలు జరుగుతున్న నేపథ్యంలో సిబ్బంది అంతా ఆ విధుల్లో ఉన్నారు. మరికొద్ది రోజుల్లో పరిస్థితిని చక్కదిద్దుతాం.

– కాశీవిశ్వనాథ్, సీఐ, రాజానగరం

వీ స్టార్ ఆసుపత్రి ప్రథమ వార్షికోత్సవం



ఆసుపత్రి వార్షికోత్సవం సందర్భంగా మాట్లాడుతున్న వీ.స్టార్ వైద్యులు

కంబాలచెరువు: స్థానిక ప్రకాష్‌నగర్ రౌండ్ పార్కు వద్ద వీ.స్టార్ ఆసుపత్రి ప్రారంభించి విజయవంతంగా ఏడాది పూర్తయ్యిందని ఆ ఆసుపత్రి వైద్యులు కె.వంశీకృష్ణ, ఎస్.వెంకటచైతన్య శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ప్రజలకు నాణ్యమైన వైద్యం అందించడంలో తాము ఎప్పుడూ ముందుంటామని, ఆ దిశగా వీ.స్టార్ ఆసుపత్రి ముందుకు వెళుతుందన్నారు. ఆసుపత్రిలో సాధారణ వైద్య సేవలతో పాటు మహిళకు ప్రత్యేక హెల్త్ చెకప్‌లు, కిడ్నీ వ్యాధులకు చికిత్స తదితరాలు చేస్తున్నామన్నారు.

వరి పొలాల పరిశీలన

కడియం: మండలంలో మరో 15 రోజుల్లో వరి కోతలు ప్రారంభమవుతాయని మండల వ్యవసాయాధికారి ద్వారకాదేవి తెలిపారు. వేమగిరి, జేగురుపాడు, కడియం ఆవ తదితర ప్రాంతాల్లో వరి చేలను శనివారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ వేమగిరి, జేగురుపాడు పరిధిలో వరి కోతలు ముందుగా మొదలవుతాయన్నారు. కడియం ఆవలో ఆలస్యంగా ఊడ్పులు జరగడంతో కోతలు కూడా ఆలస్యమవుతాయన్నారు. మండలంలో మొత్తం 2623 హెక్టార్లకు ఎంటీయూ 1121 రకం వరిని సుమారు 98 శాతం సాగు చేశారని తెలిపారు. అతి ఆర్ఎస్ఆర్ తదితర సన్న రకాలను సాగు చేశారన్నారు. ప్రస్తుతం వరిపై దోమ తీవ్రత నామమాత్రంగానే ఉందని వివరించారు.

క్రీస్తు చూపిన మార్గం అనుసరణీయం



రన్ ఫర్ జీసస్ కార్యక్రమంలో ఎంపీ మార్గాని భరత్‌రామ్

రాజమహేంద్రవరం సిటీ: లోక రక్షకుడు క్రీస్తు చూపిన మార్గం అందరికీ అనుసరణీయమని ఎంపీ మార్గాని భరత్‌రామ్ అన్నారు. శనివారం స్థానిక ప్రభుత్వ కళాశాల నుంచి సుబ్రహ్మణ్యం మైదానం వద్ద హోలీ ట్రినిటీ చర్చి వరకూ రన్ ఫర్ జీసస్ కార్యక్రమం నిర్వహించారు. దీనిని ముఖ్య అతిథిగా హాజరైన ఎంపీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీస్తు బోధనలు లోకానికి రక్ష అన్నారు. కష్టాల్లో ఉన్నప్పుడు శత్రువునైనా ఆదుకోవడంతోనే గొప్ప గుణం, మానవత్వం బయటపడుతుందన్నారు. దయ, కరుణ, సహనం, తోటివారిపై ప్రేమ ఏసు చూపిన మార్గాలన్నారు. వీటిని ప్రతి ఒక్కరూ ఆచరించడం ద్వారా మానవులంతా ఒక్కటే అనే భావన కలుగుతుందన్నారు. అనంతరం స్వామి థియేటర్ ఎదురుగా నెల్సన్ మెక్లారిన్ లూథరన్ చర్చిలో బరియల్ గ్రౌండ్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో నగర పార్టీ అధ్యక్షుడు అడపా శ్రీహరి, తూర్పుగోదావరి సేనడ్ అధ్యక్షుడు బిషప్ రెవరెండ్ అక్కాబత్తుల శామ్యూల్‌రాజు, లూథరన్ సంఘ కాపరులు, క్రైస్తవ నాయకులు గుడాల జాన్సన్, గోడి మోజెస్, పీట్లా సుమన్ తదితరులు పాల్గొన్నారు.

అయినవారే హతమార్చారు



రవికుమార్(ఫైల్)

ధవళేశ్వరం: ఆస్తి తగాదాలతో ఓ వ్యక్తిని చిన్నాన్న, అతని కుమారుడు హతమార్చిన ఘటన ధవళేశ్వరంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం స్థానిక ఎర్రకొండ ప్రాంతానికి చెందిన సిద్దిరెడ్డి రవికుమార్(35)కు శ్రీకాకుళం జిల్లా రణస్థలంలో ఉమ్మడి ఆస్తి ఉంది. ఇటీవల ఆస్తిలో కొంత భాగాన్ని రవికుమార్ చిన్నాన్న శ్రీనివాసరావు అమ్మి ఖర్చు చేయడంతో గొడవలు జరుగుతున్నాయి. రవికుమార్‌ను శనివారం సాయంత్రం ఇంటికి రమ్మని శ్రీనివాసరావు కుమారుడు ఫోన్‌లో చెప్పాడు. దీంతో అక్కడకు వెళ్లిన అతడిని శ్రీనివాసరావు, అతడి కుమారుడు రమేష్‌నాయుడులు దారుణంగా పొడిచి హతమార్చారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అతడికి భార్య, ఇద్దరు కుమార్తెలున్నారు. కేసును సీఐ దర్యాప్తు చేస్తున్నారు.

